సాక్షి అనకాపల్లి

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



విద్యుత్ సమస్యలకు పరిష్కారం

ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ నర్సీపట్నం, మాకవరపాలెంలో పర్యటించారు. సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. IIలో



అంగన్‌వాడీల్లో డిజిటల్ తరగతులు

అనకాపల్లి మండలంలోని 84 అంగన్‌వాడీ కేంద్రాలకు మంత్రి అమర్‌నాథ్ ఎల్ఈడీ టీవీలను అందజేశారు. IIలో



దేహదారుఢ్య పరీక్షలు

ఎస్ఐ ఉద్యోగాల భర్తీలో భాగంగా విశాఖ రేంజ్ పరిధిలో మూడు రోజు కూడా దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్ వర్ధంతి

అనకాపల్లి టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంతోపాటు స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి కార్యక్రమాలను శనివారం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా నేతలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రింగ్‌రోడ్డులోని మంత్రి అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో దివంగత మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించి, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి, ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు హాజరుకావాల్సిందిగా కోరారు.

జై జవాన్



తిమ్మాపతిన సూర్యారావుకు గ్రామస్తుల ఘన స్వాగతం

కశింకోట: ఇండియన్ ఆర్మీలో సుదీర్ఘ కాలం పనిచేసి సుబేదార్ మేజర్‌గా ఉద్యోగ విరమణ చేసిన తిమ్మాపతిని సూర్యారావుకు శుక్రవారం ఇక్కడి ఆర్మీ ఉద్యోగులు, రిటైర్డు ఆర్మీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆయనకు పూలమాలలు వేసి సత్కరించారు. కశింకోటకు చెందిన సూర్యారావు ఆర్మీలో క్రాఫ్ట్‌మన్ ర్యాంకులో చేరి అంచెలంచెలుగా ఎదిగారు. పదోన్నతులు పొంది 31 ఏళ్ల పాటు దేశానికే కాకుండా విదేశాల్లో సైతం సేవలందించి సుబేదార్ మేజర్‌గా తాజాగా పదవీ విరమణ చేశారు. సొంత గ్రామానికి చేరుకున్న సందర్భంగా ఆయనకు స్థానికులు అభినందనలు తెలిపారు.

వలంటీర్ మానవత్వం

- సిగ్నల్ పాయింట్ వద్దకు డోలీలో వృద్ధురాలి తరలింపు
- వేలి ముద్రలు తీసుకొని పింఛన్ పంపిణీ



బొడ్డగుడ సిగ్నల్ పాయింట్ వద్దకు వృద్ధురాలిని డోలీలో తీసుకువస్తున్న వలంటీర్ ఎర్రయ్య

దేవరాపల్లి: గిరిజన పంచాయతీ చింతలపూడి శివారు బోడిగరువు వలంటీర్ పోయిరి ఎర్రయ్య మానవత్వం చాటుకున్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న బోడిగరువు, నేరెళ్లపూడి, మదనగురువు, జారాయి కొత్తవలస గ్రామాల్లో సిగ్నల్ లేకపోవడంతో పింఛన్ కోసం కొండలు ఎక్కాల్సిన పరిస్థితి. ప్రతి నెలా పింఛన్ అందించే సమయంలో సుమారు 2 కిలోమీటర్ల దూరంలో బొడ్డగుడ వద్ద ఉన్న సిగ్నల్ పాయింట్‌కు వీరందర్నీ తీసుకెళ్లి వేలి ముద్రలు తీసుకొని పింఛన్ పంపిణీ చేస్తారు. ఈ క్రమంలో వలంటీర్ ఎర్రయ్య పరిధి నాలుగు గ్రామాల్లో 20 మంది పింఛన్‌దార్లు శుక్రవారం సిగ్నల్ పాయింట్ వద్దకు చేరుకున్నారు. తీవ్ర అనారోగ్యంతో మంచానికి పరిమితమైన వృద్ధురాలు పోయిరి సన్యాసమ్మను కుటుంబ సభ్యులతో కలిసి వలంటీర్ డోలీలో సిగ్నల్ పాయింట్ వద్దకు మోసుకొచ్చారు. వేలి ముద్రలు తీసుకొని పింఛన్ అందజేశారు.


సర్వఫల ప్రదాయిని



నర్సీపట్నం: సర్వఫల ప్రదాయిని రూపంలో మహాలక్ష్మి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీపద్మావతి సమేత అలివేలుమంగ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మహాలక్ష్మి అమ్మవారిని సర్వఫల ప్రదాయినిగా అలంకరించారు. సామూహిక కుంకుమార్చన పూజల్లో మహిళా భక్తులు పాల్గొన్నారు.

మరపురాని మహానేత

- వైఎస్సార్ హయాంలో ఉమ్మడి విశాఖ జిల్లాకు మహర్దశ
- ఆయన మరణంతో కుంటుపడిన అభివృద్ధి..
- నేడు సీఎం జగన్ నాయకత్వంలో పరుగులు
- దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నేడు



వైఎస్సార్.. ఆ పేరు ఓ ప్రభంజనం. నవ్వులో స్వచ్ఛత.. పిలుపులో ఆత్మీయత.. మాట తప్పని, మడమ తిప్పని గుణంతో ఆయన ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ప్రపంచీకరణ విధానాల యుగంలో అభివృద్ధి, సంక్షేమాలను సమపాళ్లలో మేళవించి చూపిన మహోన్నత నాయకుడు వైఎస్సార్. మహానేతను కోల్పోయి 14 ఏళ్లు గడిచిపోయాయి. కానీ ఆ జ్ఞాపకాలు చెరిగిపోలేదు..ఆ రూపం చెదిరిపోలేదు. మహానేత వైఎస్సార్ మానస పుత్రికగా విశాఖ నగరం .. ఆయన తనయుడు **ముఖ్యమంత్రి** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి **పాలనలో** ఉజ్వలంగా వెలుగొందు**తోంది. వైఎ**స్సార్ వర్ధంతి సందర్భం**గా ఉమ్మడి** విశాఖ జిల్లాలో ఆయన **చేపట్టిన అభి**వృద్ధి.. సంక్షేమాన్ని గుర్తు **చేసుకుందాం.**

– సాక్షి, అనకాపల్లి

2004.. ఉమ్మడి విశాఖ **జిల్లా అన్ని రంగాల్లో** సంక్షోభ వలయంలో చిక్కు**కొని కొట్టుమిట్టాడుతోం**ది. విశాఖ నగరంలో తాగు**నీటి సమస్య, అచ్యు**తాపురం సెజ్ ఏర్పాటుకు **భూసేకరణ, పరవాడ** ఫార్మాసిటీ భూ వివాదాలు, **గంగవరం పోర్టు భూ**సేకరణ సమస్యలు అపరి**ష్కృతంగా ఉన్నాయి.** స్టీల్‌ప్లాంట్, బీహెచ్‌పీవీ, షిప్‌యార్డులు నష్టాల ఊబిలో కూరుకుపోయి మూసివేసే పరిస్థితిలో ఉండేవి. వీటి పరిష్కారమే లక్ష్యంగా 2005 జనవరిలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విశాఖలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో అత్యవసర ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఒక్కో సమస్యకూ సానుకూల పరిష్కారం చూపించారు. నగరంలో మంచినీటి సమస్య పరిష్కారంతో పాటు అచ్యుతాపురం, ఫార్మా సెజ్‌లకు భూముల ధర నిర్ణయించడంతో పాటు పునరావాస ప్యాకేజీలు ప్రకటించారు. నష్టాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను గట్టెక్కించి రెండో దశను విస్తరించాలని నిర్ణయించారు. భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెసల్స్(బీహెచ్‌పీవీ)ని భెల్(బీహెచ్ఈఎల్)లో విలీనం చేశారు. షిప్‌యార్డును రక్షణ శాఖలో విలీనం చేసి పునరుజ్జీవం కల్పించారు. అదే సమావేశంలో విశాఖలో ఐటీకి అభివృద్ధి బాట వేశారు. అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజా నాయకుడిగా మన్ననలు అందుకున్నారు. ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104, ఆరోగ్యశ్రీ, గృహనిర్మాణం, జలయజ్ఞం.. ఇలా ఎన్నో పథకాలను విజయవంతంగా అమలు చేశారు.



వైఎస్సార్ గురుతులివీ..

- జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ పట్టణ పునర్నిర్మాణ పథకం(జేఎన్ఎన్‌యూఆర్ఎం)లో విశాఖ నగరాన్ని చేర్పించడంలో వైఎస్సార్ కీలక పాత్ర పోషించారు. ఆయన చొరవతో నగరానికి రూ.1,885 కోట్ల విలువైన పనులు దక్కాయి. సింహాచలం, పెందుర్తి బీఆర్‌టీఎస్ కారిడార్లు, ఆశీల్‌మెట్ట ఫ్లైఓవర్, విలీన గ్రామాలకు తాగునీటి సౌకర్యం, భూగర్భ మురుగు నీటి వ్యవస్థ, మౌలిక సదుపాయాల కల్పన మొదలైన 20 ప్రాజెక్టులను వైఎస్సార్ తీసుకొచ్చారు.
- విశాఖ విమానాశ్రయానికి అంతర్జాతీయ హోదా తీసుకొచ్చింది వైఎస్సారే. దాంతో విమాన సర్వీసులు గణనీయంగా పెరిగాయి. విదేశాలకు కూడా ఇక్కడ నుంచి విమానాలు ఎగిరాయి. ఆ ఒరవడి కొనసాగిస్తూ ఇటీవల భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు.
- ఉత్తరాంధ్ర ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలందించేందుకు 2006లో విమ్స్‌కు వైఎస్సార్ శ్రీకారం చుట్టారు. 1130 పడకలు, 21 సూపర్ స్పెషాలిటీ బ్లాకులతో రూ.250 కోట్లతో విమ్స్ ఆస్పత్రి నిర్మాణానికి 2007లో శంకుస్థాపన చేశారు. ఆయన మరణాంతరం అనేక పరిణామాల తర్వాత 2016 ఏప్రిల్‌లో విమ్స్ అందుబాటులోకి వచ్చింది. అంతా సవ్యంగా సాగుతున్న తరుణంలో చంద్రబాబు ప్రభుత్వం.. విమ్స్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు కుయుక్తులు పన్నింది. అప్పుడే ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్ సీపీ ఈ ప్రయత్నాన్ని అడ్డుకుంది. కోవిడ్ సమయంలో విమ్స్ స్టేట్ కోవిడ్ హాస్పిటల్‌గా విశేష సేవలందించింది.
- గోదావరి నీటిని విశాఖతో పాటు ఉత్తరాంధ్ర తాగు, సాగు, పారిశ్రామిక అవసరాలు తీర్చాలన్న సంకల్పంతోనే పోలవరం ఎడమ కాలువను నిర్మించారు. తాండవ, రైవాడ, పెద్దేరు, కోనాం ప్రాజెక్టుల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. ఏలేరు నీటిని మళ్లించడం ద్వారా స్టీల్‌ప్లాంట్ నీటి సమస్యను పరిష్కరించారు.
- విశాఖ నగరంలోని నిరుపేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో రాజీవ్ గృహకల్ప ఇళ్లకు శ్రీకారం చుట్టారు. నగర పరిధిలో సుమారు లక్షకుపైగా పునరావాస, పూర్‌సెటిల్‌మెంట్ కాలనీ ఇళ్లు నిర్మించారు. రాజీవ్ గృహకల్ప ద్వారా రూ.650 కోట్లతో 15,320 ఇళ్లు, జేఎన్ఎన్‌యూఆర్ఎం ద్వారా రూ.600 కోట్లతో 15 వేల గృహాలు, వాంబే కింద రూ.400 కోట్లతో 9 వేల ఇళ్ల నిర్మాణం చేశారు.
- ఐటీ ప్రగతి ఒక్క హైదరాబాద్‌కే పరిమితం కాకుండా వికేంద్రీకరణ జరగాలని వైఎస్ భావించారు. విశాఖలో 3 కొండలు, కొండల కింద ఉన్న సుమారు 100 ఎకరాల పల్లపు ప్రాంతాన్ని ఎంపిక చేశారు. కనీసం 100 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే ఐటీ కంపెనీలకు మాత్రమే అవకాశమిచ్చి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు ప్లాట్లుగా డివైడ్ చేసి అందించారు. సుమారు 200 కంపెనీలు ముందుకొచ్చాయి.కొద్ది కాలంలోనే 70 శాతం కంపెనీలు కార్యకలాపాలను ప్రారంభించాయి. సత్యం, విప్రో కంపెనీలూ విశాఖలో తమ శాఖలను విస్తరింపజేశాయి. అలా.. వైజాగ్‌ను ఐటీ హబ్‌గా మార్చేందుకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయి. వైఎస్సార్ మరణం తర్వాత.. దాదాపు పదేళ్లు విశాఖ ప్ర'గతి'తప్పింది. మళ్లీ 2019 తర్వాత ఐటీ ప్రగతి మళ్లీ పట్టాలెక్కింది. కొత్తగా ఇన్ఫోసిస్ తమ కార్యకలాపాలు ప్రారంభించింది. అదానీ డేటా సెంటర్‌కు ఇటీవలే సీఎం జగన్ శంకుస్థాపన చేశారు.

మహా విశాఖ


వైఎస్సార్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌ను 2005లో మహా విశాఖ నగరపాలక సంస్థగా మార్పు చేస్తూ.. గ్రేటర్ హోదా కల్పించారు. 2013లో భీమిలి, అనకాపల్లి మున్సిపాలిటీలు విలీనం అయ్యాయి. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మరో 10 పంచాయతీలను గ్రేటర్‌లో విలీనం చేశారు.



జీవీఎంసీ కార్యాలయం

అన్నదాతలకు అండగా..

వైఎస్సార్ అన్నదాతలకు చేసిన మేలు చిరకాలం గుర్తుండిపోతుంది. పాయకరావుపేట నియోజకవర్గంలో తాండవ, వరాహ నదులపై మినీబ్యారేజీల నిర్మాణం ద్వారా దాదాపు 25 **వేల ఎకరాలకు సాగునీరు** అందించి రైతన్నల **మదిలో చిరస్థాయిగా నిలి**చిపోయారు. రూ.8 **కోట్లతో పాయకరావుపేట** వద్ద మినీ బ్యారేజీ **నిర్మించి తాండవ జలాలు వృ**థా పోకుండా అడ్డు**కట్ట వేసి సాగుకు ఉపయోగ**పడేవిధంగా చర్యలు **తీసుకున్నారు. మహానేత** నిర్ణయంతో ఖరీఫ్, **రబీల్లో రెండు పంటలు పం**డించుకుంటున్నారు. **పుష్కర ఎత్తిపోతల పథకం** ద్వారా గోదావరి నీటిని పాయకరావుపేట వరకు తరలించేందుకు రూ.25 కోట్లు కేటాయించారు. ఎస్.రాయవరం మండలంలో వరాహనది గ్రోయిన్లకు రూ.5 కోట్లతో మరమ్మతులు చేపట్టి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించారు. పోలవరం ఎడమ కాలువ కింద పాయకరావుపేట నియోజకవర్గంలో 6, 7, 8 ప్యాకేజీల కింద పాయకరావుపేట నుంచి యలమంచిలి వరకు కాలువ నిర్మాణ పనులు 60 శాతం పూర్తయ్యాయి. కాలువలో చేరిన వర్షపు నీటితో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో కాలువను ఆనుకుని ఉన్న పొలాల్లో రైతులు ఖరీఫ్‌తోపాటు రబీలో కూడా వరి పండించి ఫలాలు అనుభవిస్తున్నారు. ప్రతి ఏటా పోలవరం కాలువలో చేరిన నీటితో సుమారు 5 వేల ఎకరాలు సాగు చేస్తున్నారు.



పరవళ్లు తొక్కుతున్న పోలవరం కాలువ

కౌలు రైతులకు ఆర్థిక భరోసా

- జిల్లాలో 1,904 మంది కౌలు రైతులకు లబ్ధి
- నమూనా చెక్కు అందించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో 1,904 మంది కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకంలో రూ.కోటీ 42 లక్షలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం తాడేపల్లి నుంచి వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని వర్చువల్‌గా ప్రారంభించి, బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, కౌలు రైతులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులకు కూడా వ్యవసాయ పెట్టుబడి సాయంగా ప్రభుత్వం ఈ నగదును అందించినట్లు పేర్కొన్నారు. ఈ విడతలో ఒక్కో రైతుకు రూ.7,500 ఆర్థిక లబ్ధి చేకూరినట్లు తెలిపారు. మే, జూన్ నెలల్లో అధిక వర్షాలకు నష్టపోయిన తమలపాకు, అరటి పంటల ఉద్యానవన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.1,28,650లు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు వెల్లడించారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీలను ప్రభుత్వం వరుసగా ఐదో ఏడాది అందించినట్లు తెలిపారు. జిల్లాలో అన్ని రైతు భరోసా కేంద్రాలలో సీఎం కార్యక్రమాన్ని రైతులు వీక్షించారన్నారు. రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ కలిపి జిల్లా మొత్తం రూ.కోటీ 44 లక్షల 8,650లను చెక్కు రూపంలో రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకరరావు, వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, చిక్కాల రామారావు

క్షతగాత్రులను ఆదుకున్న అమర్‌నాథ్

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఆ మార్గంలో వెళుతూ గమనించిన మంత్రి
- వెంటనే కాన్వాయ్ వాహనంలో సీహెచ్‌సీకి తరలింపు
- తర్వాత అంబులెన్స్ ఏర్పాటు చేసి కేజీహెచ్‌లో వైద్యం



బాలుడు సంజయ్‌ను సముదాయిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



క్షతగాత్రుడు నాగేశ్వరరావును అంబులెన్స్‌లో ఎక్కించేందుకు తీసుకువస్తున్న మంత్రి సిబ్బంది

అనకాపల్లి టౌన్/పరవాడ: జాతీయ రహదారిపై సాలాపువానిపాలెం గ్రామంలో శుక్రవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రక్తపు మడుగులో సహాయం కోసం ఎదురుచూస్తున్న ఇద్దరు క్షతగాత్రులను మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదుకున్నారు. వారిని హుటాహుటిన లంకెలపాలెం సీహెచ్‌సీకి తరలించి మానవత్వం చాటుకున్నారు. బుచ్చెయ్యపేట మండలం రాజాం గ్రామానికి చెందిన పినపోలు నాగేశ్వరరావు, అతని తమ్ముని కుమారుడు సంజయ్ ద్విచక్ర వాహనంపై విశాఖ వైపు వెళుతుండగా వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న రెయిలింగ్‌ని ఢీకొంది. ఈ ప్రమా దంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. నాగేశ్వరరావుకు తలతో సహా పలు చోట్ల గాయాలై రక్తస్రావమైంది. పదేళ్ల సంజయ్ కూడా తీవ్ర రక్తస్రావంతో రోడ్డు మీదపడి ఉన్నాడు. ఇదే సమయంలో మంత్రి అమర్‌నాథ్ అనకాపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ముగించుకుని విశాఖకు వెళుతున్నారు. రోడ్డు పక్కన రక్తమోడుతూ కనిపించిన వీరి దుర్దశను చూసి, వాహనం దిగి వెంటనే తన కాన్వాయ్‌లో ఉన్న వాహనంలో ఎక్కించి లంకెలపాలెం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స జరుగుతున్న సమయంలోనే మరో రెండు అంబులెన్సులను ఆస్పత్రికి పంపించి క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

శరవేగంగా అభివృద్ధి కార్యక్రమాలు

పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలో ఇన్‌చార్జి మంత్రి రాజన్నదొర ఆదేశం



సమీక్షిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి పీడిక రాజన్నదొర, చిత్రంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

తుమ్మపాల: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగంగా పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన పెందుర్తి నియోజకవర్గ అభివృద్ధి సమీక్షలో ఆయనతో పాటు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌లు పాల్గొని అధికారులతో పలు అభివృద్ధి పనుల ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై క్షేత్రస్థాయిలో అధికారులు దృష్టి సారించి అభివృద్ధి పనుల పురోగతిని పెంచాలన్నారు. అపరిష్కృత సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలందరికి సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేపట్టారని, ఎక్కడైనా లోటుపాట్లుంటే వాటిని సరిదిద్దేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని కూడా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామన్నారు. వివిధ శాఖల పనులపై అధికారులతో కలిసి ప్రోగ్రెస్ నివేదికను కలెక్టర్ వివరించారు.

ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్య పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే పరిధిలో ఎలాంటి సమస్యలున్నా తక్షణమే పరిష్కరిస్తున్నామన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు శతశాతం చేరేలా అధికారులు మరింత కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలోని సబ్బవరం, పరవాడ మండలాల్లో జగనన్న కాలనీలు, తాగునీరు, రోడ్లు తదితర అభివృద్ధి పనులపై క్షుణ్ణంగా సమీక్షించారు. కొన్ని జగనన్న కాలనీల్లో కోర్టు కేసులు పనుల పూర్తికి ఆటంకంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. వాటిపై కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుంటానని భరోసానిచ్చారు. మిగిలిన కాలనీల్లో అప్రోచ్ రోడ్లను, విద్యుత్ సౌకర్యాలను పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. సబ్బవరంలో క్రైస్తవుల శ్మశానం కోసం స్థల పరిశీలన జరిపి, వేగంగా కేటాయించాలని అధికారులను ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి డి.అనిత, జిల్లా ప్రణాళిక అధికారి జి.రామారావు, డ్వామా పీడీ సందీప్, డీఎఫ్‌వో జి.లక్ష్మణ్, ఉద్యాన శాఖ అధికారి ప్రభాకరరావు, ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

15 నుంచి డిజిటల్ విధానంలో

రిజిస్ట్రేషన్లు

- కొత్త విధానం ప్రజల మేలు కోసమే
- జిల్లా రిజిస్ట్రార్ జానకీదేవి



నక్కపల్లి: జిల్లాలో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈనెల 15 నుంచి కార్డ్‌ప్రైమ్ 2.0 విధానంలోనే రిజిస్ట్రేషన్లు జరుగుతాయని జిల్లా రిజిస్ట్రార్ జానకీదేవి తెలిపారు. ఈ విధానం వల్ల కక్షిదారులకు ఇబ్బందులు ఉండవన్నారు. శుక్రవారం ఆమె నక్కపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ కొత్త పద్ధతిలో రిజిస్ట్రేషన్ల కోసం సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసే ప్రక్రియ జరుగుతోందన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి డిజిటల్ దస్తావేజుల ద్వారానే రిజిస్ట్రేషన్లు జరుగుతాయన్నారు. నక్కపల్లి కార్యాలయంలో ఈనెల 8 నుంచి ఈ సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ విధానం వల్ల అవసరం అయినప్పుడు ఆన్‌లైన్లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం పూర్తిగా పరిశీలించిన తర్వాతే ఈ విధానం ప్రవేశపెడుతోందన్నారు. స్టాంప్‌పేపర్లకు బదులుగా డిజిటల్ దస్తావేజులు అందుబాటులోకి వస్తాయన్నారు.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై

రేపు ఉచిత అవగాహన సదస్సు

- 3వ తేదీ ఉదయం 9 నుంచి 12.30 వరకు
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్‌తో కలిసి ఈనెల 3వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విశాఖలోని రామాటాకీస్ దరి రీజనల్ కంటి ఆస్పత్రి ఎదురుగా గల డా.బి.ఆర్.అంబేడ్కర్ భవన్‌లో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే. త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్ 2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం.. దీనికి తోడు గ్రూప్–2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనుంది. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

వేదిక:
డా.బి.ఆర్.అంబేడ్కర్ భవన్, రామాటాకీస్ దరి రీజనల్ కంటి ఆస్పత్రి ఎదురుగా విశాఖపట్నం

సమయం :
ఉదయం 9 నుంచి 12.30 వరకు

వివరాలు పంపించాల్సిన ఫోన్ నెంబర్ 8985094499

క్లుప్తంగా

ఉరుములు పిడుగులతో భారీ వర్షం



కొత్తకోటలో కుండపోత వర్షం

రావికమతం: మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకూ ఎండ,ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఈ వర్షంతో సేదతీరారు. ఉరుములు,పిడుగులతో అరగంటకు పైగా భారీ వర్షం కురవడంతో కాలువలన్నీ పొంగిప్రవహించాయి. కొత్తకోటలో కుండపోతగా వర్షం కురవడంతో గుమ్ముడు వీధి,దాసరివీధి,గాంధీనగర్ ప్రాంతాల్లో పలు ఇళ్లల్లోకి వర్షంనీరు చేరింది. ఎండుతున్న పంటపొలాల్లోకి నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

జిల్లా ముఖ్య అగ్నిమాపక అధికారి ఆకస్మిక తనిఖీ



మాక్ డ్రిల్ పరిశీలిస్తున్న జిల్లా అధికారి

మాడుగుల: అగ్నిప్రమాదాలు నివారించాలంటే.. వీటిపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలని జిల్లా ముఖ్య అగ్నిమాపక అధికారి ఆర్. వెంకటరమణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక అగ్నిమాపక కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది మాక్ డ్రిల్ పర్యవేక్షించారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొట్టిన లారీ

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

కశింకోట: స్థానిక కూడలి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ ఎ. ఆదినారాయణరెడ్డి వివరాల ప్రకారం.. కశింకోట కూడలి వద్ద రోడ్డు దాటుతున్న అనకాపల్లి మండలం పిసినికాడకు చెందిన మళ్ల రాజేశ్వరి (52)ని యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆమెను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని వెదురుపర్తిలో తమ బంధువుల ఇంటి నుంచి తిరిగి తన గ్రామానికి వెళ్లేందుకు ఇక్కడ రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదానికి గురైంది. మృతురాలి కుమార్తె హారిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొత్త పింఛనుదారుల ఆనందం

- చోడవరం నియోజకవర్గానికి 888 కొత్త పింఛన్ల మంజూరు
- లబ్ధిదారులకు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



చోడవరంలో కొత్త పింఛన్‌దారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: అభాగ్యుల ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. గతంలో కాళ్లు అరిగేలా తిరిగితేనే రాని పింఛన్ ఇప్పుడు తన ఇంటి తలుపు తట్టడంతో వారి మోములో చిరునవ్వులు విరబూశాయి. దరఖాస్తు చేసుకున్న 20 రోజుల్లోనే పింఛన్ వస్తుందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన వారందరికీ వలంటీర్ల ద్వారా శుక్రవారం కొత్త పింఛన్లు అందాయి. చోడవరం నియోజకవర్గంలో తాజాగా 888 కొత్త పింఛన్లు ఈ నెల మంజూరయ్యాయి. చోడవరం మండలంలో 255, రావికమతంలో 269, బుచ్చెయ్యపేటలో 201, రోలుగుంటలో 163 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. తొలి రోజు ఉదయమే వీరందరి ఇళ్లకు వెళ్లి వలంటీర్లు ఇవ్వడంతో పింఛన్‌దారులు ఆనందంతో పులకించిపోయారు. ఉదయం 4.30 గంటల నుంచే పాత, కొత్త పింఛన్లన్నీ లబ్దిదారులకు పంపిణీ చేశారు. చోడవరం పట్టణం కోటవీధిలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కొత్త పింఛన్‌దారులకు పింఛన్లు రూ. 2750 చొప్పున పంపిణీ చేశారు. గత పాలనలో గంటల కొద్దీ ఎండలో నిలబడితేనే కాని అందని పింఛన్ ఇప్పుడు వలంటీర్ల ద్వారా తెల్లవారకముందే ఇంటి తలుపు తట్టడంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, ఇతర పింఛన్‌దారులంతా ఆనందం వ్యక్తం చేశారు. ఇది ప్రజా సంక్షేమ ప్రభుత్వమని ఎమ్మెల్యే ధర్మశ్రీ కొనియాడారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా వారి కష్టాసుఖాల్లో తోడుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు.

పింఛన్ వచ్చిందని నమ్మలేకపోతున్నా...



ఇంత తొందరగా పింఛన్ వస్తుందనుకోలేదు. నా భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వలంటీరు వచ్చి నా వివరాలు తీసుకొని వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేశారు. నెల రోజులోనే నాకు పింఛన్ వచ్చేసింది. జగన్‌బాబు పాదయాత్రలో మా ఊరు వచ్చినప్పుడు నెల రోజులోనే పింఛన్ ఇస్తానని చెప్పిన మాట నా జీవితంలో రుజువైంది. ఆయనకు కృతజ్ఞతలు. – పెమ్మే చంద్రావతి, కొత్త పింఛన్‌దారు, పిల్లావారితోట, చోడవరం

కార్యాలయం చుట్టూ తిరగకుండానే పింఛన్..



మాట ప్రకారమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లు ఇస్తూ అందరికీ అండగా నిలుస్తున్నారు. నేను కిందటి నెల మా వలంటీర్ ద్వారా వృద్ధాప్య పింఛన్‌కు దరఖాస్తు చేశాను. ఇప్పుడు పింఛన్ రావడం నాకు చాలా ఆనందంగా ఉంది. అసలు నేను ఏ కార్యాలయం చుట్టూ తిరగలేదు. ముఖ్యమంత్రి కృతజ్ఞతలు.

– లక్కవరపు నూకరాజు, కొత్తపింఛన్‌దారుడు, పీఎస్‌పేట

ఏపీఐఐసీ భూములు పరిశీలించిన పరిశ్రమల శాఖ కార్యదర్శి



చందనాడ సమీపంలో ఏపీఐఐసీ భూములను, రికార్డులను పరిశీలిస్తున్న కార్యదర్శి యువరాజ్

నక్కపల్లి: విశాఖ–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ సేకరించిన భూములను రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ శుక్రవారం పరిశీలించారు. ఏపీఐఐసీ అధికారులతో కలిసి ఆయన చందనాడ, బుచ్చిరాజుపేట, రాజయ్యపేట, వేంపాడు తదితర గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం ప్రభుత్వం నక్కపల్లి మండలంలో 5 వేల ఎకరాలను సేకరించింది. నష్టపరిహారం చెల్లింపుల ప్రక్రియ పూర్తి చేసింది. ఇక్కడ ఏర్పాటు చేయబోయే పరిశ్రమలకు సంబంధించి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు స్టార్టప్ ఏరియా కింద 1,100 ఎకరాలను సిద్ధం చేసింది, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సరఫరా, తాగునీరు, వాడుక నీటి సదుపాయాల కోసం మొదటి విడత కింద రూ.380 కోట్లు కూడా విడుదల చేసింది. దీంతో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో పలు పరిశ్రమలు ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఈ సెజ్ కోసం నెం.16 జాతీయ రహదారి నుంచి 80 అడుగుల రోడ్డును నిర్మించేందుకు నిర్ణయించింది. జాతీయ రహదారి నుంచి కాగిత, తమ్మయ్యపేట, పాటిమీద గ్రామాల మీదుగా రోడ్డు నిర్మించేందుకు అవసరమైన భూములను సైతం సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. రైతులతో చర్చలు జరుపుతున్నారు. వారు ఎకరాకు రూ.60 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల విశాఖలో జరిగి జీ–20 సదస్సులో కూడా నక్కపల్లి మండలంలో సెజ్ ఏర్పాటు, పరిశ్రమల స్థాపనకు సిద్ధం చేసిన భూముల విషయాలు ప్రస్తావనకు వచ్చాయి. గతంలో ఇక్కడ భూసేకరణ సమయంలో కలెక్టర్‌గా పనిచేసి, ప్రస్తుతం రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి హోదాలో ఉన్న యువరాజ్ ఇపుడు ఈ భూముల పరిశీలనకు వచ్చారు. ఏయే గ్రామాల్లో భూములు సేకరించారు? పరిహారం చెల్లింపులకు సంబంధించి పెండింగ్ ఏమైనా ఉన్నాయా? స్టార్టప్ ఏరియా ఎంత సిద్ధం చేశారు? తదితర వివరాలను ఆరా తీశారు. ఆయన వెంట నర్సీపట్నం ఆర్డీవో జయరాం, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ త్రినాథరావు, తహసీల్దార్ అంబేడ్కర్, అధికారులు, మండల సర్వేయర్ పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

చోడవరం రూరల్: చోడవరం స్టేషన్ పరిధిలో ఓ బాలికను తన కోరిక తీర్చాలంటూ తరచూ వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ బి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. బాలిక సంబంధికుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

షాపు యజమానిపై చాకుతో దాడి

చోడవరం రూరల్: పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్సు ఎదుట పండ్లషాపు యజమానిపై జీపు యజమాని చాకుతో దాడి చేసి గాయపరిచిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు వివరాల ప్రకారం... సాయంత్రం 5 గంటల సమయంలో ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద గంటా పైడిరాజు పండ్ల షాపు వద్దకు జీపు డ్రైవర్, యజమాని అయిన ఐతిరెడ్డి మహేష్ చాకు పట్టుకుని వచ్చాడు. చాకుతో ఎందుకు వచ్చావని పైడిరాజు అడగడంతో మద్యం మత్తులో ఉన్న మహేష్ అతడిపై దాడికి దిగాడు. ఈ దాడిలో ఎడమ చెవి వెనుక భాగంలో తలకు బలమైన గాయమైంది. చోడవరం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక వైద్యం అందించి, మెరుగైన చికిత్స నిమిత్తం అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

అంగన్‌వాడీల్లో పిల్లలకు డిజిటల్ తరగతులు



అంగన్‌వాడీ టీచర్‌కు ఎల్‌ఈడీ టీవీను అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- 84 అంగన్‌వాడీ కేంద్రాలకు ఎల్‌ఈడీ టీవీల పంపిణీ

అనకాపల్లి టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీ స్కూల్ పిల్లలకు డిజిటల్ తరగతుల ద్వారా విద్యను బోధించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. స్థానిక గుండాల జంక్షన్ జీవీఎంసీ కల్యాణమండపం మేడపైన ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ నిధులు రూ. 1.80 కోట్లతో 84 అంగన్‌వాడీ కేంద్రాలకు సమకూర్చిన ఎల్‌ఈడీ టీవీలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు ఎల్‌ఈడీ టీవీలను అందజేయలేదని, మొదటిసారిగా అనకాపల్లి మండలంలో మాత్రమే పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మండలంలో 700 మంది ప్రీ స్కూల్ పిల్లలకు ఎల్‌ఈడీ టీవీల ద్వారా విద్య నేర్పించేవిధంగా చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఏపీఐడబ్ల్యూ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం 40 అంగన్‌వాడీ కేంద్రాల విద్యుత్ బిల్లులు కట్టకపోవడంతో ఎంపీపీ నిధుల నుంచి రూ.2.50 లక్షలతో విద్యుత్‌బకాయిలను చెల్లించినట్టు చెప్పారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి మాట్లాడుతూ మండల పరిధిలో శిథిలావస్థకు చేరుకున్న అంగన్‌వాడీ కేంద్రాలను నాడు–నేడు పథకం ద్వారా అభివృద్ధి చేయడం శుభపరిణామన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి అంగన్‌వాడీ కేంద్రాల సమస్యను తీసుకురావడంతో మరమ్మతులు చేయించారని చెప్పారు. 84 అంగన్‌వాడీ కేంద్రాల్లో 700మంది పిల్లలకు రెండు జతల యూనిఫాం, బూట్లు నెలరోజుల్లో మంత్రి నిధుల నుంచి ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు మండలంలో రేబాక అంగన్‌వాడీ ప్రీ స్కూల్ పిల్లలు తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో మాట్లాడి అందర్నీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కె.ప్రభావతి, ఏసీడీపీవో శశికళ, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ అనంతలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి మళ్ల బుల్లిబాబు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా సత్యవతి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి సత్యనారాయణ(జోషఫ్), పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, కశింకోట మండల పార్టీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు విల్లూరి చంద్రశేఖర్, పెదిశెట్టి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కూతురికి తలకొరివి పెట్టిన తల్లి



కుమార్తెకు అంత్యక్రియలు చేస్తున్న తల్లి చిట్టెమ్మ

బుచ్చెయ్యపేట: పెంచి పెద్ద చేసిన చేతులతోనే కుమార్తెకు తలకొరివి పెట్టాల్సివచ్చిందని ఆ తల్లి భోరున విలపించింది. మండలంలోని వడ్డాదిలో నివాసముంటున్న సుంకరి చిట్టెమ్మకు ముగ్గురు కుమార్తెలు. ఈమె భర్త సత్తిబాబు 15 ఏళ్ల క్రితం మృతి చెందగా ముగ్గురు అమ్మాయిలను చదివించి ఉన్నతులుగా తీర్చిదిద్దింది. పెద్ద కుమార్తెకు వివాహం చేయగా రెండవ కుమార్తె వెంకటశోభ(22) రాజమండ్రిలో ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోంది. వెంకటశోభ అనారోగ్య కారణాలతో శుక్రవారం మృతి చెందింది. దీంతో తల్లి చిట్టెమ్మ ఇంటి నుంచి శ్మశాన వాటికకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి కుమార్తె మృతదేహానికి తలకొరివి పెట్టింది. ఈ ఏడాదిలో వెంకటశోభకు పెళ్లి చేద్దామని ప్రయత్నాలు ప్రారంభించామని ఇంతలోనే మృతి చెందిందని చిట్టెమ్మ కుటుంబ సభ్యులు భోరున విలపించారు. చిట్టెమ్మను పలువురు నాయకులు పరామర్శించారు.

విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

- సకాలంలో విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తి
- సిబ్బందికి ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ ఆదేశం



పనుల పురోగతిపై సమీక్షిస్తున్న సీఎండీ పృథ్వీతేజ

నర్సీపట్నం: వినియోగదారుల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పనితీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ సిబ్బందికి సూచించారు. శుక్రవారం నర్సీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని అధికారులతో సమావేశమై డివిజన్ పరిధిలోని పనులు, విద్యుత్ సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన పద్ధతిలో విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్‌డీఎస్‌ఎస్ స్కీమ్ ఉపయోగపడుతుందన్నారు. విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సూపరింటెండింగ్ ఇంజినీర్ మహేంద్రనాథ్ ఉన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ సందర్శన

మాకవరపాలెం: ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ స్టేషన్‌లో లోవోల్టేజీ సమస్య నివారణకు నిర్మించిన అదనపు పీటీఆర్‌ను పరిశీలించారు. మండలంలో విద్యుత్ వినియోగం, కొత్తగా చేపట్టాల్సిన పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నూతనంగా చేపట్టనున్న ఫీడర్ల మార్పుపై జిల్లా, డివిజన్‌స్థాయి అధికారులతో చర్చించారు. అనంతరం గిడుతూరు, కోడూరు, బూరుగుపాలెం ఫీడర్ల పరిధిలో చేపట్టనున్న విద్యుత్ లైన్ పనులను పరిశీలించారు. ఆయన వెంట విద్యుత్‌శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యప్రతాప్, ఎస్‌ఈ డీఈ రామకృష్ణ, ఏడీ సత్యానందం, ఏఈ బాలకృష్ణ ఉన్నారు.

కోల్డ్ స్టోరేజ్‌ల ఏర్పాటుతో రైతులకు మేలు

- కె.వల్లాపురంలో కోల్డ్ స్టోరేజ్‌లు పరిశీలించిన సమన్వయకర్త జమదగ్ని



కె.వల్లాపురంలో కోల్డ్ స్టోరేజ్‌లను పరిశీలిస్తున్న జమదగ్ని, డీహెచ్‌వో ప్రభాకరరావు

మాడుగుల రూరల్: సహకార సంఘాలు ఏర్పాటు చేసే కోల్డ్ స్టోరేజ్‌లను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోల్డ్ స్టోరేజ్‌ల జిల్లా సమన్వయకర్త, విజయనగరం జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎ.వి.ఎస్.ఎ. జమదగ్ని తెలిపారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి జి. ప్రభాకరరావుతో కలిసి ఆయన శుక్రవారం మాడుగుల మండలం కింతలి వల్లాపురంలో మోదమాంబ రైతు ఉత్పత్తి సహకార సంఘం ఏర్పాటు చేసిన కోల్డ్ స్టోరేజ్‌ను పరిశీలించారు. ప్రతి గ్రామంలో రైతులు సహకార సంఘాలుగా ఏర్పడితే, పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోనేందుకు ఉద్యానవన శాఖ కోల్డ్ స్టోరేజ్‌ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. వీటి ద్వారా మంచి ధరకు తమ ఉత్పత్తులు అమ్ముకుని అధిక ఆదాయం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖాధికారి వి. భాను పుష్పలీలావతి, కె. వల్లాపురం, సాగరం సర్పంచ్‌లు తాళ్లపురెడ్డి రాంబాయి, కోట్ని జయమ్మ సన్యాసినాయుడు, కోల్డ్ స్టోరేజ్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

స్కూటర్‌ను ఢీకొట్టిన రాయి లోడు ట్రాక్టర్

- ప్రమాదంలో గృహిణి దుర్మరణం



ప్రమాద స్థలిలోనే మృతి చెందిన గృహిణి

చోడవరం రూరల్: మండలంలోని రేవళ్ల గ్రామ సమీపంలో చోడవరం– గవరవరం రోడ్డులో శుక్రవారం రాయి లోడు ట్రాక్టరు స్కూటరును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గృహిణి(56) దుర్మరణం చెందింది. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు వివరాల ప్రకారం... కె.కోటపాడుకు చెందిన వేచలపు గోవిందరావు, తన స్కూటర్ (ఏపీ 31 ఈడీ 4676)పై భార్య లక్ష్మిని వెంటబెట్టుకుని చోడవరం నుంచి తన అత్తగారి ఊరైన జి.జగన్నాథపురం మీదుగా కె.కోటపాడు వెళ్తున్నారు. ఈ క్రమంలో ప్రమాద స్థలికి వచ్చేసరికి ట్రాక్టర్(ఏపీ 31 సీఎక్స్ 2759), తొట్టి(ఏపీ 31వై 6740)లో రాయి లోడుతో గవరవరం నుంచి చోడవరం వైపు ఎదురుగా వస్తూ స్కూటర్‌ను ఢీకొట్టింది. దీంతో వీరిద్దరు పట్టుతప్పి కిందపడిన సమయంలో లక్ష్మి తల మీదుగా ట్రాలర్ టైరు వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

అథ్లెటిక్స్‌లో అదరగొట్టిన దేవరాపల్లి విద్యార్థి

- రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన దుర్గాప్రసాద్



విద్యార్థి దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న ఎంఈవో–1 పడాల్‌దాసు

దేవరాపల్లి: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి కె. దుర్గాప్రసాద్ సత్తా చాటాడు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 30న విశాఖపట్నంలో జరిగిన అండర్–17 విభాగంలో 800 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నాడు. త్వరలో నెల్లూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశాడు. ఈ మేరకు హెచ్‌ఎం, ఇన్‌చార్జి ఎంఈవో–1 బి. పడాల్‌దాస్ శుక్రవారం స్థానిక హైస్కూల్‌లో దుర్గాప్రసాద్‌ను అభినందించారు.

బాక్సింగ్ క్రీడాకారులకు అభినందన



బాక్సింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ

నర్సీపట్నం: ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి వూషు పోటీల్లో విజయం సాధించిన నలుగురు బాక్సింగ్ క్రీడాకారులను మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ అభినందించారు. గత నెల 29, 30 తేదీల్లో గుంటూరులో జరిగిన వూషు పోటీల్లో సీనియర్ విభాగంలో వేపాడ ప్రియాంక, జూనియర్ విభాగంలో బి. రాజరాజేశ్వరి, సబ్ జూనియర్ కేటగిరీలో కురచా శరణ్య శశిప్రియ, శర్వాణి బంగారు పతకాలు సాధించారు. వీరిని వైస్ చైర్మన్‌తోపాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్లవెల్లి రాము అభినందించారు. జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి నర్సీపట్నానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి పోటీలకు నాగజ్యోతి



రావికమతం: జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన ఆటల పోటీల్లో కొత్తకోట గ్రామానికి చెందిన ఉపాధ్యాయిని పి.వి.ఎం.నాగజ్యోతి ఐదు ఈవెంట్లలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గత నెల 30, 31 తేదీల్లో అనకాపల్లిలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులకు ఈ పోటీలు జరగగా షటిల్, రన్నింగ్, జావెలిన్‌త్రో, చెస్, పవర్‌లిఫ్టింగ్‌లో నాగజ్యోతి ఉత్తమ ప్రతిభ చూపారు. ఆమె ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చరల్ అండ్ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

నూకాంబికకు వెండిపట్టీల బహూకరణ



ఆలయ చైర్మన్‌కు వెండిపట్టీలు అందజేస్తున్న చక్రవర్తి, శ్వేత దంపతులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో గవరపాలెం నూకాంబిక అమ్మవారికి విశాఖకు చెందిన టి.కల్యాణ్‌చక్రవర్తి, శ్వేత దంపతులు రూ.2 లక్షల విలువ గల వెండిపట్టీలను బహూకరించారు. రెండు కేజీల 340 గ్రాముల 200 మిల్లీ గ్రాముల వెండిపట్టీలను శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణకు అందజేశారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ వర్ధంతి

కశింకోట: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం ఉదయం 8 గంటలకు కశింకోటలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన రహదారిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

కశింకోట మండలంలోని అన్ని గ్రామాల్లో దివంగత మహానేత వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించాలని ఎంపీపీ కలగా లక్ష్మి, మండల వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అభిమానులను కోరారు. వైఎస్సార్ విగ్రహాలు ఉన్న గ్రామాల్లో విగ్రహాల వద్ద నివాళులు, సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

శ్రావణ పౌర్ణమి సామూహిక హారతి


సామూహిక హారతి ఇస్తున్న మహిళలు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని గురువారం అర్ధరాత్రి వరకు సత్సంగం, సామూహిక హారతి కార్యక్రమాలను నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని హారతి వెలిగించారు. హిందూ ధర్మం గురించి ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ నక్కా సత్యనారాయణ భక్తులకు వివరించారు. మండల కన్వీనర్ మందపల్లి శివ, భక్తులు పాల్గొన్నారు.

4న ఉచిత నేత్ర వైద్య శిబిరం

కశింకోట: కశింకోటలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో 4న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు పాము సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కానూరి గోపాలరావు, విశ్రాంత ఎంఈవో నంబా రమణలు శుక్రవారం తెలిపారు. ఈహెచ్ఎస్ పథకంలో గుర్తించిన ఉద్యోగులు, ఆరోగ్య భద్రత కార్డుపై పోలీసు కుటుంబాలకు రాజమండ్రి గౌతమి నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అధునాతన సౌకర్యాలు కలిగిన నేత్రాలయంలో శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

అనకాపల్లి సినిమాలు

మిస్టిక్ (ఉదయం, సాయంత్రం)	
బేబి (మ్యాట్నీ, రాత్రి)	: రాజా
ఏం చేస్తున్నావ్	: సత్యనారాయణ స్క్రీన్-1
ద ఈక్వలైజర్ 3	: సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	: షిర్డిసాయి
ఖుషి	: పర్తిసాయి
బెదురులంక 2012	:వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	: శ్రీసత్య
ఖుషి	: రామచంద్ర

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 205 బెల్లం దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,200	4,400
రెండో రకం	4040	4100
మూడోరకం	3300	4010

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 25 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-12 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 377 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 349 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

మీ ఓటు వివరాలు తెలుసుకోండిలా..


ఓటరు జాబితా నవీనీకరణపై బీఎల్‌వోలకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో


ఇంటింటా సర్వేను తనిఖీ చేస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

ఓ యువకుడు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు కోసం ఆరా తీయగా జాబితాలో పేరు లేదన్నారు. గత ఎన్నికల్లో ఓటు వేశా.. ఈ సారి ఎందుకు లేదు? అంటూ ప్రశ్నిస్తే ఫలితం లేకుండా పోయింది. ఇది 2019 సార్వత్రిక ఎన్నికల్లో తుమ్మపాల జెడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో చోటు చేసుకున్న ఘటన. ఆ తిప్పలు లేకుండా ఇప్పుడే ఓటుందో.. లేదో.. తెలుసుకుంటే సరిపోతుందిగా..!

- పూర్తి అయిన సమగ్ర ఓటర్ల సర్వే
- మొబైల్ ఫోన్లో వివరాలు తెలుసుకోవచ్చు

నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

మండలం	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు
అనకాపల్లి	180	1,51,765
కశింకోట	71	56,265
మొత్తం	251	2,08,030

అనకాపల్లి రూరల్: ఎన్నికలు ఏవైనా ప్రాథమిక ఓటరు జాబితా తయారీ తప్పనిసరి. ఇది నిరంతర ప్రక్రియ. ఓటు హక్కు పొందడం ఎలానో.. జాబితాలో పేరుందో.. లేదో.. తెలుసుకోవడం కూడా మన బాధ్యతే. అందుకే ఎన్నికల సంఘం తాజాగా సమగ్ర ఓటరు సర్వేను నిర్వహించి, జాబితా తయారీకి కసరత్తు చేస్తోంది. ఈ జాబితాలో పేరు ఉంటే ఇబ్బంది లేదు. లేకుంటే నమోదు చేసుకోవడానికి ధరఖాస్తు చేసుకోవాలి. మరి కొద్ది నెలల్లో శాసన సభ, పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఇటీవల నెల రోజుల పాటు బీఎల్వోలు ఓటరు జాబితా సవరణపై ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు మొబైల్ ద్వారా ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో తెలుసుకునేందుకు పలు వెబ్ సైట్‌లు, యాప్‌లు అందుబాటులో ఉన్నాయి.

మొబైల్ నంబర్ ఆధారంగా

www.nvsp.in వెబ్‌సైట్‌లోకి వెళితే ఇన్ ఎలక్ట్రోరల్ రోల్ అనే విభాగం కనిపిస్తుంది. దానిని క్లిక్ చేస్తే సెర్చ్ బై డిటైల్స్, సెర్చ్ బై ఎపిక్ నంబర్, సెర్చ్ బై మొబైల్ నంబర్ అనే ఉప విభాగాలు ఉంటాయి. అందులో సెర్చ్ బై మొబైల్ నంబర్ నమోదు చేయగానే ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేస్తే ఓటరు జాబితా వివరాలు కనిపిస్తాయి. మిగతా రెండు విభాగాల్లో మీ పేరు, తండ్రి పేరు, జిల్లా, ఓటరు గుర్తింపు కార్డు నంబర్ ద్వారా తెలుసుకోవచ్చు.

ఓటరు గుర్తింపు కార్డు ద్వారా

https://voterportal.eci.gov.in వెబ్‌సైట్ ఓపెన్ చేయగానే సెర్చ్ ఇన్ ఎలక్ట్రోరల్ రోల్ విభాగం కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి ఫోటో ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య పొందుపరిస్తే జాబితాలో మీ పేరు, పోలింగ్ కేంద్రం, సీరియల్ నంబర్ తదితర వివరాలు కనిపిస్తాయి. ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య తెలియకపోతే ఆడ్వాన్స్‌డ్ సెర్చ్ విభాగంలోకి వెళ్లి మీ పేరు, తండ్రి పేరు, పుట్టిన తేది, నియోజకవర్గం, జిల్లా వివరాలు పొందుపరిచి, పేరు ఉందో.. లేదో తెలుసుకోవచ్చు.

మొబైల్ యాప్‌తో ఇలా..

గూగుల్ ప్లే స్టోర్‌లో voter helpline యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని, లాగిన్ అవ్వాలి. యాప్‌లోకి ప్రవేశించాక సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఎలక్ట్రోరల్ రోల్ విభాగం ఉంటుంది. దానిపై క్లిక్ చేస్తే సెర్చ్ బై బార్‌కోడ్, సెర్చ్ బై క్యూఆర్ కోడ్, సెర్చ్ బై డిటైల్స్ , సెర్చ్ బై ఎపిక్ నంబరు కనిపిస్తాయి. మొదటి, రెండు విభాగాలకు సంబంధించి మీ ఓటరు కార్డు పైన ఉన్న బార్‌కోడ్, లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఓటు వివరాలు తెలుస్తాయి.

పోలింగ్ కేంద్రాల వారీగా జాబితా

https://ceoandhra.nic.in వెబ్ సైట్‌లోకి వెళితే ఎలక్ట్రోరల్ రోల్స్ విభాగం ఉంటుంది. దానిపై క్లిక్ చేస్తే జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గ వివరాలు కనిపిస్తాయి. సంబంధిత నియోజకవర్గం పేరు ఎంచుకుంటే అన్ని పోలింగ్ కేంద్రాల ఓటర్ల జాబితా పీడీఎఫ్ రూపంలో ఉంటుంది. ఏ పోలింగ్ కేంద్రం పరిధిలోకి వస్తారో చూసుకొని దానికి సంబంధించిన జాబితాను పరిశీలించి మన వివరాలు సరి చూసుకోవచ్చు. అందులోనే సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఓటరు లిస్ట్ విభాగం ద్వారా ఓటు వివరాలు తెలుసుకోవచ్చు. అదే విధంగా 1950 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి జాబితాలో మన పేరు ఉందో? లేదో? తెలిసిపోతుంది.

ఓటు హక్కుపై అవగాహన అవసరం



ప్రతి ఒక్కరికి ఓటు హక్కుపై అవగాహన అవసరం. ఓటరు జాబితా నవీకరణ నిరంతర ప్రక్రియ. అర్హులందరూ ఓటు నమోదు చేయించుకోవాలి. ఓటు హక్కు విషయంలో బాధ్యతగా ఉండాలి. ఇందుకు ఓటరు అవగాహన కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతున్నాం. రాజకీయ పార్టీల భాగస్వామ్యం తీసుకుంటున్నాం. ఓటర్లలో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఒక్క క్లిక్‌తో ఓటరు జాబితాలో పేరుందో లేదో సరిచూసుకోవడానికి వీలుంది.
– ఏజీ చిన్నికృష్ణ, ఆర్డీవో, అనకాపల్లి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం


వృద్ధురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్


మంత్రి అమర్‌నాథ్‌పై మహిళల పూల వర్షం

- నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నా
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్

కశింకోట: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తూ, రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కశింకోట 3వ సచివాలయ పరిధిలోని అఫీషియల్ కాలనీ, గోవిందరావు కాలనీ, కోటదిబ్బ, కనకమహాలక్ష్మి వీధుల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. సంక్షేమ పథకాలు అందుకోని అర్హులెవరైనా మిగిలి ఉంటే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. ప్రతి చోట దుశ్శాలువాలు కప్పి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి స్థానికులను అడిగి పెండింగ్‌లో ఉన్న సమస్యల్ని తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజక వర్గ సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వ పాలనలో గతంలో ఎన్నడూ చూడనంత అభివృద్ధి నియోజకవర్గంలో జరిగిందన్నారు. కశింకోట గ్రామంలో కోట్లాది రూపాయలతో సిమెంట్ రోడ్లు, కాలువలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు మద్దతు అందించాలని కోరారు.

కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ, పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాలరావు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, పార్టీ శ్రేణులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫ్రైడే డ్రైడే

తుమ్మపాల: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులకు గురవకుండా, దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్(జెడ్సీ) చక్రవర్తి సూచించారు. పట్టణంలోని 80వ వార్డు సతకంపట్టు, 82వ వార్డు నర్సింగరావుపేట, ఓల్డ్ బర్మా కాలనీల్లో శుక్రవారం వేర్వేరుగా ఫ్రైడే డ్రైడేపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలను సందర్శించి పరిసర ప్రాంతాల్లో నిల్వ నీటిని పారిశుధ్య కార్మికులతో కలిసి తొలగించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా తదితర రోగాలకు కారణమైన దోమలు ఇలాంటి నిల్వ నీటిలోనే పెరుగుతాయన్నారు. వాటి నిర్మూలనలో భాగంగా ప్రజలు తమ ఇళ్లల్లో వారంలో కనీసం ఓ రోజు పాత్రల్లో నీరు లేకుండా ఆరబెట్టుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం మంచినీటి పాత్రలను శుభ్రం చేయడం, ఫ్రిడ్జ్ వెనుక నీటిని తొలగించడం, పరిసరాల్లో టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, కుండీల్లో నీరు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ రజని, మలేరియా ఇన్‌స్పెక్టర్ గణేష్, ఎస్.ఎస్.రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జెడ్సీ చక్రవర్తి

సీఎం జగన్‌తోనే గ్రామాల అభివృద్ధి

ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించిన మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: గ్రామాల అభివృద్ధి తమ ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గొలగాం పంచాయతీ కొత్తతలారివానిపాలెం గ్రామంలో రూ.68 లక్షలతో నిర్మించిన ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్, నూతన డ్రైనేజీ వ్యవస్థను ఆయన శుక్రవారం ప్రారంభించారు. గ్రామాల్లో సకల సదుపాయాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పల్లె ముంగింటకే ప్రభుత్వ సేవల్ని అందుబాటులోకి తీసుకొచ్చారని కొనియాడారు. అందులో భాగంగానే ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లను గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైద్యులు, పలు శాఖల అధికారులు, సర్పంచ్ ఎస్ఎన్ లక్ష్మీనర్సింహ, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

మంత్రి అమర్‌నాథ్‌కు సత్కారం

అనకాపల్లిటౌన్: రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో సిద్ధిలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ తాతాజీ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు చైర్మన్ పదవి ఇచ్చినందుకు మంత్రి అమర్‌నాథ్‌ను చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండా రమేష్ గుప్తలు సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. తమ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తామని మంత్రికి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అర్రెపు సూర్యారావు, చెరుకూరి నాగేశ్వరరావులు ఉన్నారు.


మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న తాతాజీ, రమేష్‌గుప్త

నూకాంబిక ఆలయంలో కుంకుమార్చనలు


నూకాంబిక సన్నిధిలో కుంకుమార్చనలో పాల్గొన్న పాలకమండలి సభ్యులు

అనకాపల్లిటౌన్: గవరపాలెం నూకాంబిక ఆలయంలో శ్రావణమాస మూడో శుక్రవారం పురస్కరించుకుని ఆలయ మండపంలో కుంకుమార్చనలు జరిగాయి. ఆలయానికి నూతనంగా నియమితులైన పాలకమండలి సభ్యులతోపాటు అధికసంఖ్యలో మహిళా భక్తులు హాజరయ్యారు. ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, సభ్యులు కంటపల్లి శోభారాణి, పీలా లక్ష్మీశ్రీనివాసరావు, పాము అనురాధ, మళ్లవరపు ఈశ్వరరావు, ఆడారి ఉమా చంద్ర మహేశ్వరి, బుద్ధ నరసింగరావు, గొల్లవిల్లి నరసింగరావు, కొండూరు రవీంద్ర, ఆలయ ఈవో బండారు ప్రసాద్ పూజల్లో పాల్గొన్నారు.


గౌరీ పంచాయతనలో లక్ష పుష్పాలతో మహిళా భక్తుల ప్రదక్షిణలు

గౌరీపరమేశ్వరికి స్వీట్లతో అలంకరణ

గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరి అమ్మవారిని పలు రకాల మిఠాయిలతో అలంకరించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు గోపాలకృష్ణ శర్మ, శేషు ఆధ్వర్యంలో లక్షపుష్పార్చన నిర్వహించారు. ఆలయం చుట్టూ లక్ష పుష్పాలతో మహిళాభక్తులు ప్రదక్షిణలు చేసి, పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివ సూర్యనారాయణ, సభ్యులు లక్ష్మీనర్సింగరావు, బాలకృష్ణ, పెంటకోట ఉమామహేశ్వరరావు, పెంటకోట సుబ్రహ్మణ్యం, ఎల్లపు రమణ పాల్గొన్నారు.

'సీఎం జగన్ రుణం తీర్చుకుందాం'

అనకాపల్లిటౌన్: అవ్వాతాతలకు పింఛన్ మొత్తం పెంచుతూ, అర్హులైన వారందరికి నూతన పింఛన్లు అందిస్తూ, బాసటగా నిలుస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా రుణపడిపోయామని, రానున్న ఎన్నికల్లో ఆయన్ని మళ్లీ సీఎంగా గెలిపించి రుణం తీర్చుకుందామని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. 80వ వార్డు గవరపాలెం బంగ్లా వద్దనున్న 19వ సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన పింఛన్లను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికోసారి రూ.250 చొప్పున పింఛన్ సొమ్ము పెంచుతున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికెళ్లి మరీ అవ్వాతాతలకు పింఛన్ అందించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఇలాంటి సంక్షేమం, అభివృద్ధి ప్రతిపక్షాలకు కనిపించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజల తరఫున సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, పార్టీ శ్రేణులు పాలిమేర శివఅప్పారావు, పెట్ల నాగేశ్వరరావు, దాడి త్రినాథ్ పెంటకోట సన్యాసిరావు, కర్రి అప్పాజీ, కోరుబిల్లి ఆరుద్ర, విల్లూరి నారాయణరావు, కె.పరమేశ్వరరావు, రాజేష్, పెంటకోట శాంతి, లబ్ధిదారులు పాల్గొన్నారు.


నూతన పింఛన్ అందిస్తున్న దాడి రత్నాకర్

జగనన్న పాల వెల్లువలో రుణ సౌకర్యం

కశింకోట: జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా పాడి రైతులకు రుణాలు ఇవ్వనున్నట్లు కన్నూరుపాలెం పశు వైద్యాధికారి డాక్టర్ డయానా తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం, పేరంటాలపాలెం, అమీన్‌సాహెబ్‌పేట, ఏనుగుతుని, త్రిపురవానిపాలెం, గొబ్బూరు గ్రామాల్లో వేర్వేరుగా శుక్రవారం జగనన్న పాల వెల్లువ పథకంలో రుణాలపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా పాడి రైతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. సహకార సంఘాలను ఏర్పాటు చేసి, వాటికి రిజిస్ట్రేషన్ కూడా కల్పించిందన్నారు. జగనన్న పాల వెల్లువ పథకంలో ప్రభుత్వం అందిస్తున్న రుణ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అమూల్ పాల కేంద్రానికి పాలు పోసే ప్రతి పాడి రైతు రూ.30 వేల వరకు రుణాన్ని పొందడానికి అర్హులన్నారు. ఈ రుణాన్ని డీసీసీబీ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. పాడి పశువుల కొనుగోలుకు సహకార సంఘాల ద్వారా రూ.లక్ష నుంచి రూ.లక్షా 60 వేల వరకు రుణాన్ని పొందవచ్చన్నారు. డీసీసీబీ శాఖ ప్రతినిధి అచ్చియ్యనాయుడు, అమూల్ ఆర్ఐసీ బి.గీతావాణి, జేవీవో కరుణశ్రీ పాల్గొన్నారు.


జగనన్న పాల వెల్లువ అవగాహన సదస్సు

ఘనంగా ఎస్‌బీఐ యూనియన్ వార్షికోత్సవం

సబ్బవరం: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా యూనియన్ ఐదో వార్షికోత్సవాన్ని సబ్బవరం శాఖ సిబ్బంది శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమరావతి సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శాఖ సిబ్బంది కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తారక్‌నాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనకాపల్లి రీజియన్ రీజనల్ కార్యదర్శి పైలా ప్రసాదరావు మాట్లాడుతూ స్టేట్ బ్యాంకులోని సిబ్బంది అభ్యున్నతికి యూనియన్ నాయకులు విశిష్ట సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో భాగంగా ఖాతాదారులకు ఆహారం, మజ్జిగ పంపిణీ చేశారు.

పెట్రో ధరలు తగ్గించాలని ధర్నా


దేశపాత్రునిపాలెం సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పరవాడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని అనకాపల్లి జిల్లా సీపీఎం కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. అధిక ధరలకు నిరసనగా దేశపాత్రునిపాలెం సచివాలయం ఎదుట శుక్రవారం సీపీఎం కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల సామాన్యులపై భారం పడిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వి.వి.రమణ, పి.మాణిక్యం, గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా కొర్లయ్య

పరవాడ: సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యూత్ కార్యదర్శిగా, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జిగా ముత్యాలమ్మపాలేనికి చెందిన సీహెచ్ కొర్లయ్యను నియమిస్తూ సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకం పట్ల శంకరయ్యకు కొర్లయ్య కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త పింఛన్ల పంపిణీతో లబ్ధిదారుల్లో ఆనందం


తాళ్లపాలెంలో ఆనందం వ్యక్తం చేస్తున్న కొత్త పింఛన్ లబ్ధిదారులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ పరిధిలో కొత్తగా 17 మందికి పింఛన్లు మంజూరు కావడంతో వాటిని శుక్రవారం లబ్ధిదారులకు అందించారు. వీటిలో వితంతువులకు 12, వృద్ధులకు నాలుగు, వికలాంగులకు ఒకటి వంతున పంపిణీ చేశారు. దీంతో పింఛన్ పొందిన లబ్ధిదారుల ఆనందం చెప్పనలవి కానంతగా ఉంది. తమ పరిస్థితిని, అర్హతను గుర్తించి పింఛన్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, సర్పంచ్ రెల్లి నాగయమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు ముసిలినాయుడు, జెర్రిపోతుల సన్యాసినాయుడు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

పరవాడ: మండలంలో ఈదులపాక బోనంగి గ్రామానికి చెందిన జయకిరణ్(14),హరికిరణ్(10) అనే విద్యార్థులు గత నెల 31న అదృశ్యమయ్యారని నడింపల్లి సత్యనారాయణ పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసుకు సంబంధించి సీఐ పి.ఈశ్వరరావు అందించిన వివరాలు. ఈ. బోనంగి గ్రామానికి చెందిన నడింపల్లి సత్యనారాయణ తమ్ముడి కుమారులైన జయకిరణ్, హరికిరణ్‌లను కూర్మన్నపాలెంలోని చైతన్య పాఠశాలలో చదివిస్తున్నారు. జయకిరణ్ 9వ తరగతి చదువుతుండగా.. హరికిరణ్ 8 తరగతి చదువుతున్నాడు. వీరిరువురూ గత నెల 31న సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చి దుస్తులు మార్చుకున్నారు. టాయిలెట్‌కు వెళ్లి వస్తామని చెప్పి రాత్రి 7 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన అన్నదమ్ములిద్దరూ ఎంతకీ తిరిగా రాకపోవడంతో కంగారు పడి చుట్టు పక్కల గాలించినా కనిపించలేదు. అయితే హరికిరణ్ యలమంచిలి వద్ద శుక్రవారం దొరికాడు. జయ కిరణ్ ఆచూకీ కోసం గాలింపు చేపట్టాలని విద్యార్థుల పెదనాన్న సత్యనారాయణ ఫిర్యాదు చేసినట్లు సీఐ ఈశ్వరరావు తెలిపారు.